క్లుప్తంగా

పీ-4 పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమణారెడ్డి

సి.బెళగల్: పీ – 4 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఆదోని డీఎల్‌డీఓ రమణారెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాణెమ్మ, తహసీల్దార్ వెంకటలక్ష్మి, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీ – 4 కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టే కార్యచరణను ఆయన సమావేశానికి హాజరైన పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. అదేవిధంగా తల్లికి వందనం, ఉపాధిహామీ పనులు, గృహ నిర్మాణ అంశాలపై ఆయా శాఖల మండల అధికారులతో సమీక్షించారు. డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఎంఈఓ ఆదామ్‌బాషా, హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ రామన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీ–4 మార్గదర్శి, బంగారు కుటుంబాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్, తల్లికి వందనం మొదలగు అంశాలపై సమీక్ష సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేపచెట్టు నుంచి పాలధార



వేప చెట్టుకు పాలు కారుతున్న దృశ్యం

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని నిడ్జూరు గ్రామం బీసీ కాలనీలో వేప చెట్టు నుంచి పాలు కారుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అమ్మవారికి ప్రీతకరమైన వృక్షం వేపచెట్టు కనుక ఆ అమ్మవారే తన మహిమను చూపేందుకు ఇలా పాలను ప్రవింపజేస్తున్నారని మహిళలు భావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోసకారి చంద్రబాబు

- అధికారం కోసం ఎన్నికల ముందు మాయమాటలు
- ఏడాది గడిచినా హామీల అమలు లేదు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని ధ్వజం
- ఓర్వకల్లులో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమానికి విశేష స్పందన



క్యూఆర్ కోడ్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఓర్వకల్లు: ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రం ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు శ్రీరెడ్డి చెన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కాటసానితో పాటు కర్నూలు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జీకే వెంగన్న అతిథులుగా హాజరయ్యారు. వీరు ముందుగా స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి భారీ ఊరేగింపుతో జీవేశ్వరస్వామి కల్యాణ మండపానికి చేరుకొని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులను ఉద్దేశించి కాటసాని మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు ఏడాది గడిచినా వాటిని అమలు చేయలేదన్నారు. దీంతో ఆయనను నమ్మి ఓట్లేసిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తొలి నుంచి చంద్రబాబు చెప్పింది చేయడన్నారు. అయితే, ప్రజలను మాయమాటలతో మోసం చేయడంలో ఆయన దిట్ట అని విమర్శించారు. ఈ విషయాలన్నీ ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఉద్దేశం ఇదేనని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన బ్రోచర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు మోసాలు తేటతెల్లమవుతాయని చెప్పారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏవీ?

కూటమి నాయకులు ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం ద్వారా బడికెళ్లిన ప్రతి బిడ్డకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేస్తున్నారని కాటసాని విమర్శించారు. అర్హులైన చాలా మందికి ఈ పథకం వర్తించ లేదన్నారు. అలాగే దీపం పథకం కింద ప్రతి ఇంటికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ప్రకటించి మోసం చేశారన్నారు. రెండో ఏడాదిలో కూడా రైతులకు అన్నదాత సుఖీభవ సాయం అందలేదన్నారు. పంట పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతుభరోసా కింద ఏటా రైతులకు రూ. 13,500 సాయం అందేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఇలా ప్రతి పథకాన్ని చంద్రబాబు అటకెక్కించారని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలను దగా చేశారన్నారు. ఈ విషయాన్ని వారు గ్రహించారని అవకాశం వచ్చినప్పుడు వారు ఓటుతో బుద్ధిచెబుతారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వచ్చిన సోలార్, స్టీల్ ప్లాంట్ తదితర పరిశ్రమలను టీడీపీ నాయకులు తాము తీసుకొచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కూటమి నేతలు రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులకు పాల్పడుతున్నారని, దీనికి స్వస్తి పలకకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం క్యూఆర్‌కోడ్ బ్రోచర్లను ఆవిష్కరించారు. . కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నన్నూరు చెన్నారెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగతిరుపాలు, సోమశేఖర్‌రెడ్డి, గఫ్ఫార్ సాహెబ్, శంకర్ రెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి, పందిపాటి శరీఫ్, పార్టీ అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు శివకృష్ణారెడ్డి, చేట్ల కృపయ్య, అనీల్‌కుమార్, ప్రభుకుమార్, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అభిమానులు పాల్గొన్నారు.

మంత్రి గారూ.. రౌడీషీటర్లను కట్టడి చేయండి



టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): మంత్రి టీజీ భరత్ గారూ.. నగరంలో రౌడీషీటర్లను కట్టడి చేయండి. రాత్రి వేళ మద్యం తాగి వ్యాపారులను బెదిరిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న కర్నూలు నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు. నగరంలోని 10వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్ బాషా ఉన్న వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయాన్ని టీజీకి చెందిన గూండాలు గురువారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో వస్తువులన్నీ పగులగొట్టి ఉండటం, కంప్యూటర్, టీవీ ధ్వంసమై ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో టీడీపీ గుండాలు రెచ్చిపోతున్నారని మండిపడ్డారు. మంత్రి టీజీ భరత్ ఇలాంటి శక్తులను కట్టడి చేయాలన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు షేక్ యూనుస్ బాషా కార్యాలయంపై దాడి చేయడం తగదన్నారు. దాడి చేసిన టీడీపీ గుండాలు తమపైనే దాడులు జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడం దుర్మార్గమన్నారు. పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.

ప్రజావేదికలో సమన్వయంతో వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: సామాజిక తనిఖీలపై నేడు నిర్వహించనున్న ప్రజా వేదిక బహిరంగ సభలో తనిఖీ అధికారులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. ఆమె శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్పీ వెంకటేస్‌నాయక్, తనిఖీ అధికారులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. తనిఖీలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. గత 15 రోజులుగా గ్రామాల్లో తనిఖీ అధికారులు చేపట్టిన అంశాల్లో తేలిన లోపాలు, సమస్యలపై తగిన ఆధారాలతో వేదికలో ప్రదర్శించుకోవాలని, తనిఖీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది ఘర్షణ వాతావరణం లేకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో ఏపీఓ రామన్న, జేఈ రంగస్వామి, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

జాయింట్ ఎల్‌పీఎంల సమస్య పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఉలిందకొండ, కొల్లంపల్లి తండా గ్రామాలకు చెందిన రైతులకు జాయింట్ ఎల్‌పీఎంలు విడదీసి ఆన్‌లైన్ చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బాధిత రైతులతో కలిసి వారు తహసీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ భూముల రీసర్వే చేసిన సర్వేయర్లు ఉలిందకొండ, కొల్లంపల్లితండా గ్రామాలకు చెందిన 85 మంది రైతులకు జాయింట్ ఎల్‌పీఎంలు ఇచ్చారన్నారు. దీంతో వారు తల్లికివందనం, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలకు దూరమవుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూ సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు తక్షణమే పరిష్కరిస్తామని చెప్పి 13 నెలలైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులును కలిసి వినతి పత్రమిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి మధు, నాయకులు పూలరంగడు, మారన్న, రమేష్, గోపాల్ నాయక్, వెంకటస్వామి నాయక్, చిన్న శివమ్మ, రాధమ్మ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్యాజువాలిటీ వైద్యులపై విచారణ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల క్యాజువాలిటీలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యులపై సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు విచారణకు ఆదేశించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శారద, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.వీ.కిరణ్‌కుమార్‌లను విచారణాధికారులుగా నియమించారు. ఈ నెల 17న ఓ యువకుడి ఎంఎల్‌సీని అవుట్ పోస్ట్‌కు పంపించడంలో వైద్యులు నిర్లక్ష్యం వహించారని అందిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు.

సీఎం చంద్రబాబు నోరు తెరిస్తే అబద్ధాలే



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు లక్ష్మీనరసింహ యాదవ్

కల్లూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నోరు తెరిస్తే అబద్ధాలు ఆడుతారని ఏఐసీసీ సభ్యులు, నంద్యాల పార్లమెంటరీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు గురువారం నంద్యాల జిల్లా మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద నీటి పంపింగ్ మోటర్ స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారన్నారు. ఆ సమయంలో హంద్రీనీవా ప్రాజెక్టును తానే పూర్తి చేశానని పచ్చి అబద్ధాలు చెప్పరన్నారు. నిజానికి ఎన్టీ రామారావు హంద్రీనివా ప్రాజెక్టు డిజైన్ చేశారని, 2004లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పనులు చేపట్టి పూర్తి చేశారన్నారు. సీఎం చంద్రబాబు కోస్తాంధ్రను అభివృద్ధి చేస్తూ రాయలసీమను గాలికి వదిలేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలస్వామి, పఠాన్ అభిఖాన్, రజాక్, జాకీర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

కర్నూలు(రూరల్): స్థానిక ఏ.క్యాంపులోని తన కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ తెలిపారు. సమావేశానికి కుడా మాజీ చైర్మన్, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాజరుకానున్నారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డ్రమ్ముల్లో నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు సూచించారు. శుక్రవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి చెట్లమల్లాపురం గ్రామంలో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా వ్యాధులు సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణంగా డెంగీ వ్యాధి దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో, నీటి గచ్చులు, గుంతలు, డ్రమ్ములు మొదలగు వాటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దీనిపై ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఒక వేళ జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు స్వర్ణ గౌరీ, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు నాగరాజు, మద్దమ్మ, ఏఎన్ఎమ్ ప్రశాంతి, ఆశా కార్యకర్తలు ఖలీల్ పాల్గొన్నారు.

చినుకు పడితే ఇంతే..!

- హైవే నిర్వహణ లోపంతో వాహనదారుల ఇక్కట్లు



పాణ్యం బస్టాండ్‌లోని వీయూపీ కింద నిలిచిన వర్షపునీరు

పాణ్యం: జాతీయ రహదారి నిర్వహణ లోపంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసిన నీరు రోడ్లపై నిలిచిపోయి రాకపోకలకు సమస్యగా మారుతుంది. ఈ విషయం హైవే అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. మండల కేంద్రమైన పాణ్యంలోని బస్టాండ్‌లో వీయూపీ (వెహికల్ అండర్‌పాస్) పీయూపీ (పబ్లిక్ అండర్‌పాస్) కింద వర్షం నీరు వెళ్లేందుకు కాలువ లేదు. దీంతో చిన్న పాటి వానకే అక్కడ నీరు నిలిచిపోయి రాకపోలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. హైవే అధికారులకు అనేక సార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వీయూపీ, పీయూపీ కింద వర్షం నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాత పెట్రోల్ బంకు వద్ద రహదారిపై వర్షపునీరు నిలిచిన దృశ్యం

ప్రమాదకరంగా 'మ్యాన్‌హోల్స్'



పాతబస్టాండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వెనుక నడిరోడ్డుపై మ్యాన్‌హోల్ గుంత



కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని పాతబస్టాండులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వెనుక నడిరోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. మురుగుకాల్వపై వేసిన గ్రిల్ కుంగిపోవడంతో గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. అలాగే కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎదురుగా మ్యాన్‌హోల్ గ్రిల్ కుంగిపోయింది. ప్రతిరోజూ ఈ రహదారిగుండా వందల వాహనాలు వెళ్తూ ఉంటాయి. ఆదమరిస్తే ఆ గుంతలో పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



రోడ్డుపైనే మడుగు

కర్నూలు (న్యూటౌన్): చిన్నపాటి వర్షాలకే రోడ్లపై నీరు నిలవడంతో కర్నూలు నగరం కుంటను తలపిస్తోంది. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్ పోస్టు సర్కిల్ వద్ద రోడ్డుపై చిన్నపాటి వర్షానికే నీరు నిలవడడంతో భారీ వాహనాల రాకపోకలతో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షపునీరు నిల్వ ఏర్పడి వాహనదారులకు అసౌకర్యంగా మారింది. ఈ మార్గంలో రోజూ కర్నూలు మీదుగా నందికొట్కూరు, ఆత్మకూరు, గుంటూరు, విజయవాడకు వెళ్తూ వచ్చే వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిత్యం ట్రాఫిక్‌తో కిక్కిరిపోయే ప్రాంతం. పాదచారులు కనీసం రోడ్డు దాటేందుకు కూడా వీలులేకుండా నడిరోడ్డుపై వర్షపు నీరు నిలబవడంతో వాహనదారులు, మరోవైపు పాదాచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గుంతలను పూడ్చివేసి వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మూగవేదన

- పులకుర్తిలో మూతపడిన పశు వైద్యశాల
- 2 నెలలుగా మూగజీవాలకు అందని వైద్యం
- సొంత భవనం లేదంటూ సిబ్బందిని నియమించని అధికారులు
- పశువులకు వైద్యమందక ఇబ్బంది పడుతున్న పాడిరైతులు



పిచ్చిమొక్కలతో నిండిన పశు వైద్యశాల ప్రాంగణం



పులకుర్తిలో మూతపడిన పశు వైద్యశాల

కోడుమూరు రూరల్: కోడుమూరు మండలం పులకుర్తి గ్రామంలోని పశు వైద్యశాల గత రెండు నెలల నుంచి తెరచుకోవడం లేదు. ఇక్కడ పనిచేస్తున్న పశువైద్యాధికారి చంద్రమౌళి రెండు నెలల కిందట క్రిష్ణగిరి మండలానికి బదిలీ కావడంతో అప్పటి నుంచి పశు వైద్యశాల మూతపడి ఉంది. దీంతో మూగ జీవాలకు వైద్యం చేయించుకోలేక పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వర్షాలు కురిసి పశువులు, గొర్రెలకు వివిధ రకాల రోగాలు సోకుతుండడం, గ్రామంలో ఉన్న పశు వైద్యశాల మూతపడడంతో రోగమొచ్చిన మూగజీవాలను గ్రామానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న కల్లపరి గ్రామానికి గానీ, మండల కేంద్రమైన కోడుమూరుకుగానీ తీసుకెళ్లి వైద్యం చేయించాల్సిన దుస్థితి దాపురించింది. కొన్ని సమయాల్లో వైద్య అందక మూగజీవాల ప్రాణాలు సైతం పోతున్నాయంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత భవనం లేనందుకేనంటా..!

పులకుర్తి గ్రామ పంచాయతీతో పాటు, మజారా గ్రామమైన మెరుగుదొడ్డి గ్రామాన్ని కలుపుకుని సుమారు 2 వేలకు పైగా పాడి పశువులు, ఎద్దులతో పాటు, 4 వేలకు పైగా గొర్రెలు, మేకలున్నాయి. వీటికి వైద్యం కోసం పులకుర్తిలోని ఓ అద్దె భవనంలో దశాబ్దాలుగా పశు వైద్యశాలను అధికారులు కొనసాగిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ ఉన్న పశువైద్యాధికారి, అసిస్టెంట్ ఇతర ఊర్లకు బదిలీ కావడంతో వారి స్థానంలో జిల్లా అధికారులు పులకుర్తి గ్రామానికి ఎవ్వరినీ నియమించలేదు. దీంతో రెండు నెలల నుంచి పులకుర్తిలోని పశు వైద్యశాల మూతపడి ఉంది. పశు వైద్యశాలకు పులకుర్తిలో సొంత భవనం లేకపోవడం, ఇక్కడికి వచ్చే పశు వైద్య సిబ్బందే అద్దె చెల్లించుకోవాల్సి రావడం వల్లనే పులకుర్తికి సిబ్బంది రావడం లేదంటూ అధికారులు వింత సమాధానం చెబుతుండడం గమనార్హం. కాగా వేలాది మూగజీవాలున్న తమ గ్రామానికి పశువైద్య సిబ్బందిని ప్రభుత్వం కేటాయించకపోతే ఎలా అని, ఎన్నో ఏళ్లుగా ఉన్న పశు వైద్యశాలను మూసేస్తే తమ మూగజీవాల పరిస్థితి ఏమిటంటూ పెంపకందారులు వాపోతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి పాడి పశువులపై ఆధారపడి జీవిస్తున్న తమ గ్రామానికి పశు వైద్య సిబ్బందిని నియమించి, పశు వైద్యశాలను కొనసాగించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పశు వైద్యశాలను సిబ్బంది లేరంటూ రెండు నెలల నుంచి తెరవడం లేదు. దీంతో పాడి పశువులకు ఏమైనా రోగాలు వస్తే నయం చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పశువుల బాధను తట్టుకోలేక మా ఊరికి ఐదు కిలోమీటర్ల దూరాన ఉన్న కల్లపరికి వెళ్లి వైద్యం చేయిస్తున్నాం. అధికారులు స్పందించి మా ఊరిలో మూతపడిన పశు వైద్యశాలను తెరిపిస్తే బాగుంటుంది.

– వెంకటేష్, పాడి రైతు, పులకుర్తి గ్రామం

ఇన్‌చార్జ్ వైద్యాధికారిని నియమించాం

పులకుర్తి పశు వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి, అటెండర్ బదిలీపై వెళ్లారు. తర్వాత జిల్లా అధికారులు పులకుర్తి గ్రామానికి పశువైద్య సిబ్బందిని నియమించలేదు. ప్రస్తుతం మండలంలోని ప్యాలకుర్తి పశు వైద్యాధికారికి పులకుర్తి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. పరిస్థితిని బట్టి వారానికి ఒకటి నుంచి రెండు రోజుల పాటు ఇన్‌చార్జ్ అధికారి వెళ్లి మూగజీవాలకు వైద్యసేవలందిస్తారు.

– రామసుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, కోడుమూరు